

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**రాజేష్ పది పైసల** బిళ్ళని చూపించి దాన్ని కుడిచేతిలో వుంచుకుని గుప్పిట మూశాడు. కుడిచేతి గుప్పిట కింద ఎడం గుప్పిటని వుంచాడు. పైదాంట్లోంచి కింద గుప్పెటలోకి ఆ నాణెం జారవిడుస్తున్నట్లు మళ్ళీ కుడిగుప్పిట మీద ఎడం గుప్పిట వుంచాడు అదే పద్ధతిలో. ఇలా నాలుగైదు సార్లు చేసి రెండు గుప్పిటలు దూరం దూరంగా వుంచి అడిగాడు.

"ఏ చేతిలో వుందో కనుక్కో తాతయ్యా"

దశరథరామయ్య కుడిచేతి గుప్పిట ముట్టుకున్నాడు. దాన్ని తెరిచాడు రాజేష్. లేదు. ఎడం చేతి గుప్పిట తెరిస్తే అందులో వుంది.

"ఓడిపోయావ్ మళ్ళీ" చెప్పాడు రాజేష్.

నాకో మంచి స్నేహితుడు దొరికాడు. ఇప్పుడు నాకు కొడుకు కోడలు తిరిగి వచ్చేదాకా ఇంట్లో వంటరితనం అంటే తెలియదు. మనసులో అనుకున్నాడు దశరథరామయ్య.

"సరే - మళ్ళీ" చెప్పాడు ఆయన ఉత్సాహంగా.

ఆయనకి తన బాల్యం, దాదాపు యాభై సంవత్సరాల క్రితం తన బాల్యం గుర్తుకు వస్తోంది. అప్పటి స్నేహితులు, అప్పటి ఆటలు, అప్పటి అనుభూతులు ఒక్కొక్కటే మస్తిష్కపు అట్టడుగునించి ఉపరితలంలా వస్తున్నాయి.

అదెంతో హాయిగా వుంది దశరథరామయ్యకి.

14

పంచాక్షరరావు ముందు అతని స్కూటర్ పక్కనే సాంబశివరావు తన స్కూటర్‌ని ఆపాడు. సాంబశివరావు ఓసారి గేటుకున్న బోర్డువంక చూశాడు.

'బాపూజీ అనాథశరణాలయం.'

ఇద్దరూ స్కూటర్స్‌కి తాళాలు వేసి లోపలికి నడిచారు. ముందుగది దాటాక కుడివైపువున్న పెద్ద గది ఆఫీస్ గది. ఓ పాత చెక్కబల్లముందు కూర్చుని వున్నాడో నలభై అయిదేళ్ళాయన.

సాంబశివరావు ఆ గదివంక పరిశీలనగా చూశాడు. గోడలనిండా అనేక గ్రూప్ ఫోటోలు వేలాడుతున్నాయి. ఫోటోల్లో వాళ్ళంతా చిన్న పిల్లలే. నెహ్రూ, గాంధి, ఇందిరాగాంధి ఫోటోలు, జనవరి, ఫిబ్రవరి నెలలు చూపించే ఆంధ్రాబ్యాంక్ కేలండర్ ఆ గది మేకులకి వేలాడుతున్నాయి. కేలండర్ పేజీలు ఆ నెలయ్యాక చింపే అలవాటు లేదనుకున్నాడు సాంబశివరావు.

"కూర్చోండి" ఆ ముసలాయన సావధానంగా చెప్పాడు.

ఇద్దరూ కూర్చున్నాక ప్రశ్నార్థకంగా చూశాడు వారివంక. సాంబశివరావు ఆయన పక్కన పుస్తకాల రేక్‌లో వున్న పుస్తకాలను చూస్తూండడం తప్ప ఏం మాట్లాడలేదు.

పంచాక్షరరావు అర్థం చేసుకుని గొంతు సవరించుకుని చెప్పాడు.

"కొన్ని విషయాలు అడిగి తెలుసుకుని, మీరు మాకు సహాయం చేయగలరో లేదో తెలుసుకుందామని వచ్చాం."

"అడగండి."

మీ అనాధ శిక్షణాలయంలో కొత్తవాళ్ళని చేర్చుకుంటారా?"

"కొత్తవాళ్ళంటే?"

"ఓ ఏడేళ్ళ కుర్రాడు, తల్లిదండ్రులులేరు. ప్రస్తుతం మా దగ్గర వున్నాడు."

"మీ దగ్గరకి ఎలా వచ్చాడు? పేరెంట్స్ ఏమయ్యారు?"

ఆ ప్రశ్నలకి సమాధానం నిజమే చెప్పాలని ముందే నిర్ణయించుకున్నారు. జరిగింది జరిగినట్లు చెప్పాడు పంచాక్షరరావు.

ఆయన ఆశ్చర్యంగా విని అడిగాడు.

"అయితే మీ భార్య మిమ్మల్ని అనుమానిస్తోందన్నమాట?"

"నా భార్య కాదు, ఇతని భార్య. నా పేరు పంచాక్షరరావు. ఆయన ఫ్రెండ్‌ని."

"అయితే సావిత్రి మీకు పరిచయమే లేదా?" అడిగాడు ఆయన సాంబశివరావుని పరకాయించి చూసి.

తల అడ్డంగా వూపాడు అతను.

"అనాథ శిక్షణాలయంలో పిల్లల్ని చేర్చుకోడానికి కొన్ని రూల్సున్నాయి. వాళ్ళకి తల్లిదండ్రులు కాని, దగ్గర బంధువులు కానీ, ముఖ్యంగా వారిని పోషించేవారు లేరని నిర్దారణ కావాలి. తరువాత వారి ఆరోగ్యం సరిగ్గా వుందని సివిల్ సర్జ న్ నించి సర్టిఫికెట్ కావాలి. బర్త్ సర్టిఫికెట్ కావాలి. ఇంకా.." దాదాపు అరగంట సేపు పంచాక్షరరావు, ఆయన విషయం చర్చించారు. ఓ కాగితం మీద ఏఏ డాక్యుమెంట్స్ అవసరమో జాబితా రాసుకున్నాడు.

మరో నాలుగైదు రోజుల్లో కలుస్తామని చెప్పి బయటికి వచ్చారు.

"చూస్తుంటే ఇవన్నీ సంపాదించగలమా అనిపిస్తోంది" నిరాశగా చెప్పాడు సాంబశివరావు.

"ఇది నీ జీవితంలో తప్పనిసరిగా జరగాల్సింది కాబట్టి మన ప్రయత్నం మనం చేయక తప్పదు" చెప్పాడు పంచాక్షరరావు.

ఇద్దరూ స్కూటర్స్ ఎక్కి స్టార్ట్ చేశారు.

"రండి, రండి."

వాళ్ళిద్దర్నీ ఆనందంగా ఆహ్వానించింది సాహితి.

"మీ కోసమే ఎదురు చూస్తున్నాను" చెప్పింది.

"పాలకోవా చేయటం అయిందా?" అడిగింది బన్ని.

"అయిపోయింది. కూర్చోండి."

బన్ని, పక్కనే రాజేష్ కూర్చున్నారు ఒకే కుర్చీలో.

"నీ పేరేంటి బాబూ?" అడిగింది సాహితి.

"రాజేష్" చెప్పాడు.

"నువ్వేం చదువుతున్నావ్?"

"సెకండ్ స్టాండర్డ్ పరీక్షలు రాశాను."

"అప్పుడే సెకండ్ స్టాండర్డ్‌కి వచ్చేశావా? గుడ్ మీ అమ్మ పేరు"

"సావిత్రి."

"మీ వూరు?"

"విజయవాడ."

"నీ కెన్నేళ్ళు?"

"పాలకోవ" చెప్పింది బన్ని.

"మీ నాన్నగారి పేరేమిటి బాబూ?" అడిగింది మళ్ళీ.

రాజేష్ ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. బన్ని చెప్పింది.

"సాంబశివరావు. త్వరగా పాలకోవ పెట్టు."

"మీ నాన్నగారి పేరు సాంబశివరావేనా?" అడిగింది.

బన్ని ఆమె చేతిలోని ప్లేట్‌వంక ఆశగా చూస్తోంది. రాజేష్ నిర్లిప్తతతని గమనించసాగింది సాహితి.

"మీ తాతయ్య?"

రాజేష్ బదులు చెప్పలేదు.

"ఇంద తిను" సాహితి తన చేతిలోని ప్లేట్‌ని రాజేష్‌కి యిచ్చింది.

"నో థాంక్స్"

"ఫర్వాలేదు తిను. తియ్యగా వుంటుంది" చెప్పింది బన్ని ఓ ముక్క అందుకుని.

"మీ అమ్మ దగ్గరికి వెళతావా లేక ఇక్కడే వుండిపోతావా?"

రాజేష్ మౌనంగా బయటకు చూశాడు కాని జవాబు చెప్పలేదు.

"మీ అమ్మే ఇక్కడికి వస్తుందా?"

"నే వెళ్ళొస్తానండీ" రాజేష్ కుర్చీలోంచి లేచాడు. సాహితి ఆ కుర్రాడి భుజం పట్టుకుని ఆపి చెప్పింది.

"అదేమిటి కొద్దిగా తిను."

"వద్దండి."

"తొందరేమిటి? కాస్సేపు కూర్చో నీకు బోర్నవిటా యిష్టమా? హార్లిక్స్ యిష్టమా?" ఆశ పెట్టింది.

"వెళతానండీ" గింజుకోసాగాడు.

"ఉండబ్బాయ్ ఆఫీస్ కెళ్ళాలా? స్కూల్‌కి వెళ్ళాలా? ఏమిటా తొందర?"

"వాడ్ని వెళ్ళనివ్వు."

గుమ్మం బయట నిలబడ్డ భర్త కంఠం విని అటువైపు చూసింది సాహితి. పంచాక్షరరావు తీవ్రంగా చూస్తున్నాడు భార్యవంక.

"ఎంతసేపైంది వచ్చి?" తన కంగారును దాచుకుంటూ అడిగింది.

బన్ని కూడా కుర్చీలోంచి లేచి, ప్లేటులోని పాలకోవ బిళ్ళలు తన గౌను జేబులో వేసుకుంది. పిల్లలిద్దరూ బయటకి నడిచారు.

పంచాక్షరరావు భార్యవంక నిరసనగా చూశాడు.

"నీకు ఈ బుద్ధి చచ్చేదాకా పోదు."

"ఇప్పుడేమైందని?"

చిన్నగా నిట్టూర్చాడు.

"నాలిక కన్నా చెవులు ఎందుకు మంచివో తెలుసా? తాము విన్నవి అవి చెప్పవు. విననివి  కూడా నాలిక బయట పెడుతుంది. నాకు నీ నాలికంటే అసహ్యం."

సాహితి వెనక్కి తిరిగి, భర్త చూడకుండా మూతి మూడువంకర్లు తిప్పి ఓసారి తన నాలికని చూసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"ఇంకెప్పుడూ వాళ్ళింటికి తీసుకురాకు" చెప్పాడు రాజేష్ ఇంటికి వెళుతూ

"ఏం, పాలకోవా బావుందికదా? తిని చూడు కావాలంటే"

అమ్మ అక్కడికి వస్తుందా? తను అమ్మ దగ్గరకి వెళతాడా? అన్న ఆలోచనని రాజేష్‌లో సృష్టించింది సాహితి. ఆ ఆలోచన భరించలేనంతగా వుంది రాజేష్‌కి.

"నువ్వే తిను. నాకా పాలకోవా అంటే అసహ్యం" చెప్పాడు.

దశరథరామయ్య కండువా వేసుకుని బయటకి వెళ్ళాడు. రామ్ నగర్ దాటి కొద్ది దూరంలో వున్న లోకల్ లైబ్రరీకి వెళ్ళాడు.

లైబ్రేరియన్ దగ్గరికి వెళ్ళి అడిగాడు "చిన్న పిల్లల అకథల పుస్తకాలేమైనా వున్నాయా?"

లైబ్రేరియన్ తల అడ్డంగా వూపి చెప్పాడు.

"అశోక్ నగర్ లైబ్రరీలో వుంటాయి.

ఆయన బస్సు ఎక్కడానికి అట్టే యిష్టపడడు. నడిచి సిటీ సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళాడు. చిల్డ్రన్స్ సెక్షన్‌లోని రేక్‌లోవున్న పుస్తకాలని పరిక్షించి ఓ పుస్తకం తీసుకున్నాడు. దాని పేరు గ్రిమ్స్ ఫెయిరీ టేల్స్ దాన్ని తిరగేశాడు కానీ అవన్నీ రాజులూ, మంత్రగత్తెల కథలు. ఆయన మరో నాలుగైదు పుస్తకాలు తిసి చూశాడు. కానీ వాటిలో జంతువులు పాత్రలుగా గల కథలు లేవు.

చివరికి 'ఫెయిరీ టేల్స్ ఆఫ్ రష్యా' అనే పుస్తకంలో ఆయనకి కావలసిన కథలు కొన్ని వున్నాయి. ఆ పుస్తకం తీసుకుని కూర్చుని ఓపికగా వాటిని చదవసాగాడు.

ఆ రాత్రి ఆయన రాజేష్‌కి కథ చెప్పాలి మరి.

దశరథరామయ్య ఇంట్లో ఇదివరకులా చుట్ట తాగే స్వతంత్రం పోగొట్టుకున్నాడు. రాజేష్ చూస్తుండగా చుట్ట తాగలేని మానసిక బలహీనతకి లోనయిపోయాడు. అందుకే మరీ కోరికగా వుంటే, తలుపేసుకుని టాయ్‌లెట్‌లో తాగుతున్నాడు. చుట్ట తాగి మొహం, నోరు శుభ్రంగా కడుక్కుని బయటకి వచ్చాడాయన.

హాల్లో తనకోసం ఎదురు చూస్తున్న కొడుకు కనపడ్డాడు.

"నాన్నగారూ ఆ కుర్రాడ్ని ఓసారి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళగలరా?" అడిగాడు.

"అవునా కోడలికి చెప్పాను ఆ సంగతి. సాయంత్రం తీసుకువెళతానంది."

"ఎందుకు నీరజకి చెప్పారు? అయినా మీకెలా తెలుసు?"

"రోజూ నాలుగైదుసార్లు ఉదయం కూడా లాగు తడుపుతోంటే కనపడటంలా?"

"అందుకు కాదు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గురించి. అది కావాలి."

"దేనికి?"

కొద్దిగా తడబడి చెప్పాడు.

"అనాథశరణాలయంలో అనాథలని చేర్చుకోవటానికి ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ముఖ్యం కాదా మరి?"

"అనాథ శరణాలయమా?" ఆశ్చర్యంగా అడిగాడు దశరథరామయ్య.

"అవును."

"ఇది నీకొచ్చిన ఆలోచనేనా? లేక నీ పెళ్ళానిదా?"

"నాదే"

"తెలుస్తూనే వుంది."

"అలా అంటారేమిటి నాన్నగారూ అనాథలుండాల్సింది అనాధశరణాలయంలోనేగా?"

దశరథరామయ్య కొడుకు కళ్ళలోకి రెప్ప వాల్చకుండా చూశాడు కొన్ని క్షణాలు.

"ఈ ఇంట్లో రాజేష్ తల్లిదండ్రులు లేరు. ఎక్కడున్నారో, అసలు బ్రతికివున్నారో లేదో కూడా తెలియదు. నీరజకి ఆ కుర్రాడు ఇంట్లో వుండటం యిష్టంలేదు. మరి వాణ్ణి ఏం చెయ్యాలి అర్ఫనేజ్‌లో చేర్చకపోతే?" అడిగాడు సాంబశివరావు.

దశరథరామయ్య నోరు మెదపలేదు. తండ్రి ముఖ కవళికలను బట్టి ఆయనకి తన మాటలు రుచించలేదని గ్రహించాడు సాంబశివరావు.

"ఆ చిన్న పొట్టకి పట్టెడన్నం పెట్టలేమనికాదు. నీరజ ...తప్పదు నాన్నగారూ"

ఆయన మౌనంగా తల పంకించాడు.

"వాడు నా కొడుకు కాదన్న సంగతి మీరయినా నమ్మండి నాన్నగారూ."

"ఏ తల్లీ తన కొడుకుని యిలా పంపటానికి సాహసించదు."

మరి కొన్ని క్షణాలు మౌనం.

"ఈ కుర్రాడు ఎంతో హుషారుగా, తెలివిగా వుంటే, ముసలివాళ్ళకు వాడు తన మనవడయితే బావుండు అనిపిస్తుందనుకుంటున్నాను అలాంటప్పుడు వారసత్వం మీద వద్దనుకున్నా నమ్మకం కలుగుతుంది. మీకలాంటి నమ్మకమే కలిగింది. కాని వాడు నా వారసుడు కాడు."

సాంబశివరావు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

నీరజ మిగతా విద్యార్థులతోపాటు ప్రొఫెసర్ మేల్‌కోటే చెప్పే లెక్చర్‌ని శ్రద్ధగావింటూ, పాయింట్స్ నోట్ చేసుకుంటోంది. అది ఎంతో ఆసక్తిగా వుండటంతో అంతా చెవులు రిక్కించి వింటున్నారు.

"కాబట్టి ఓ మనిషి ఇంకొక మనిషిమీద తనకున్న ఫీలింగ్స్ ఎంత దాద్దామనుకున్నా దాచలేడు. అది మనిషన్న వాళ్ళకి అసాధ్యం. భోళామనుషులు తమ ఫీలింగ్స్ బయటకి చెప్పేస్తారు. తక్కువ మాట్లాడేవాళ్ళు తను చర్యలద్వారా వ్యక్తం చేస్తారు. ఉదాహరణకి భార్యాభర్తలని తీసుకుందాం. భార్య తప్పుచేస్తే భర్త కోప్పడతాడు. మంచిపని చేస్తే పొగుడుతాడు. భర్తకి భార్యముందు తన ఫీలింగ్స్ వ్యక్తం చేసే స్వతంత్రం వున్న దేశం మనది. కాబట్టి తన కోపాన్ని తిట్టి, మొట్టి, కొట్టి చూపించగలడు"

క్లాసులో విద్యార్థులు ముసిముసిగా నవ్వారు. విద్యార్థుల నాడి తెలుసు కాబట్టి తను చెప్పే విషయాన్ని అర్థం అయ్యేలా చక్కటి ఉదాహరణనిచ్చి చెప్తూంటాడు ప్రొఫెసర్ మేల్‌కోటే.

"కాని కొందరు తమ ఫీలింగ్స్ బయటపడకుండా దాచేసుకుంటారు. వాటిని వ్యక్తం చేయటం తెలియకపోవచ్చు. లేదా మనదేశంలోని భార్యలకిలాగా వ్యక్తం చేసే స్వతంత్రం లేకపోవచ్చు. అలాంటప్పుడు మనిషి చేసే మాములు చర్యలద్వారానే ఆ ఫీలింగ్స్ వ్యక్తం అవుతాయి" ఆగి వూపిరి పీల్చుకుని మళ్ళీ చెప్పసాగాడు.

"చాలా చాలా సాధారణమైన చర్యలద్వారా ఫీలింగ్స్ బయటకి తరచూ త్వరగా వస్తాయి. ఉదాహరణకి భార్య ఉదయం భర్తని నిద్రలేవడం తీసుకుందాం."

ఆయన ఎదురుచూసిన ఆసక్తి విద్యార్థులందరిలో తొంగిచూసింది.

"ఆ నిద్రలేపటం చాలా సాధారణమైన చర్య. కానీ ఈ చిన్న దిన చర్యద్వారా మనిషిలోని ఫీలింగ్స్ బయటపడతాయంటే ఆశ్చర్యంగా వుంటుంది. పెళ్ళయిన కొత్తల్లో భార్య భర్తని నిద్రలేపడం ఓ అందమైన అనుభవం ప్రతీ భర్తకి. ఎందుకంటే భార్యకి అప్పుడు భర్తే లోకం కాబట్టి ఇంకా ఇద్దరి మధ్యా పొరపొచ్చాలు వుండవు. ఆ రోజులు ముందుంటాయి."

నీరజకి తన భర్తని బెంగుళూరులోని హోటల్ గదిలో మొదటిసారి ఉదయం నిద్రలేపిన సంఘటన గుర్తుకొచ్చింది. ఆయన ఏం చెప్తాడా అన్నట్లుగా చూసింది. చాలామంది కళ్ళు కొత్తగా పెళ్ళయిన తనవైపు ఓరగా చూడటం కూడా అదే క్షణంలో గుర్తించింది నీరజ.

"భర్త పక్కన కూర్చుని, తలంటుకున్న జుట్టులోంచి నీళ్ళు అతని మీద పడకుండా జాగ్రత్తపడి, అతని తలని ఒళ్ళో పెట్టుకుని, కుడి చూపుడు వేలుతో మృదువుగా కనురెప్పలమీద, చెంపలమీద రాస్తూ ఇంకా ఇలాంటివి చాలా 'గుడ్ మార్నింగ్ డార్లింగ్' లేదా 'దొరగారు లేస్తారా?' 'ఐ లవ్ యు' అనటం, ఓ ముద్దుకూడా కలవచ్చు. మిగతాది మీరు వూహించుకోండి."

క్లాసులో అంతా నవ్వుతూ విన్నారు, నీరజతో సహా. 'ఎంత కరెక్ట్‌గా ఆయన దగ్గరనుండి చూసినట్లుగా చెప్పారు' అనుకుంది నీరజ. తర్వాత 'ఇదే మనస్తత్వం శాస్త్రంలోని గొప్పదనం. మనుష్యుల ప్రవర్తనని చూసి కనుక్కోగలవారే టెక్స్ట్ బుక్స్ రాస్తారు' అనుకుంది.

"హనీమూన్ వేకప్ అలా వుంటే సంవత్సరం తిరిగాక లేవండి సరిగ్గా నిమిషంలో బాత్‌రూంలో కూర్చుంటేనే ఇవాళయినా ఆఫీసుకి టైం కి వెళ్ళగలరు' అని వంట గదిలోంచి అరుస్తుంది అదే భార్య. అంటే పెళ్ళయిన కొత్తల్లో

ఒకరిమీద ఒకరికుండే ప్రేమ తీక్షణత పలచబడిందన్నమాట. హనీమూన్ రోజుల్లో లేని జీవితంలోని సాధకబాధకాలు మనిషిని అలా చేస్తాయి. భార్యకి భర్తమీద వుండే సహజమయిన ప్రేమ అది. మరి కొద్దికాలం గడిస్తే ఆయన భుజాలు కుదిపి "ఓకే లేచే వేళయింది. లేవండి అంటుంది. ముందురోజు పోట్లాడి ఇంకా సెటిల్ కాకపోతే ఆయన కప్పుకున్న దుప్పటిని బలంగా తీసేసి, ఫేన్ ఆర్పేసి వంటగదిలోకి వెళ్ళిపోతుంది. బెడ్ కాఫీ అలవాటుంటే వేడివేడి సెగలు కక్కే కాఫీ కప్పును ఆయన భుజం మీద చురకకూడా వేయవచ్చు. రెండేళ్ళ కొడుకుని నాన్నగారు మీద కూర్చోబెట్టి 'నాన్న లేచేదాకా ఆడుకోరా' అనచ్చు. అలారం మరో రెండు నిమిషాల్లో మోగేలా సెట్ చేసి భర్త చెవి పక్కన వుంచొచ్చు. రేడియో వాల్యూం పెద్దది చేసి బెడ్‌రూంలోంచి వంటగదిలోకి వెళ్ళవచ్చు. నీళ్ళు మొహం మీద చిలకరించవచ్చు. 'ఇంక చస్తే ఈ జన్మలో మిమ్మల్ని లేపితే ఒట్టు' అని అరిచి తలుపు చప్పుడయ్యేలా వేసి బయటికి వెళ్ళద్దు లేదా అసలు పదకొండయినా నిద్ర లేకపోవచ్చు. లేదా..."

విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నవ్వుకుంటూ వింటున్నారు.

"భార్య భర్తని లేపే విధానాన్ని బట్టి ఆమెకి అతనిమీద ఎంత ప్రేమవుందో వాళ్ళమధ్య మానసిక సంబంధం ఎంతదాకా వుందో అంచనా వేయచ్చు. ప్రేమ, ఇష్టం, కోపం, హాస్యం, మృదుత్వం, అసహ్యం. అసలు ఎలాంటి ఫీలింగ్స్‌లేని ఇండిఫరెన్స్ ఈ చిన్న దినచర్యలో బయటపడుతుంది. ఇదే సైకాలజీ. మనసులోని భావాలు యిలా అనాలోచితంగా వ్యక్తం చేస్తాడు ప్రతీ మనిషి. ఇవాల్టికి ఈ లెక్చర్ ముగించేముందు ఓ మాట. రేపు ఉదయం మీలో పెళ్ళయిన వారు మీ జీవిత భాగస్వామిని ఎలా నిద్రలేపుతారు?" విద్యార్థులు తమలో తాము ఆ టాపిక్ గురించే మాట్లాడుకుంటున్నారు.

నీరజ మాత్రం తన భర్త గురించి ఆలోచించసాగింది. అలిగి పడుకున్న తనని ఆయన ఆ ఉదయం తన వీపుమీద ప్రేమగా నిమురుతూ 'నీరూ శుభోదయం లే. పోనీ అయిదు నిమిషాలాగి లేపనా?' అని నిద్రలేవటం గుర్తొచ్చింది.

ఆయనలో వున్న ఓ బలహీనతకి ఆయన లొంగిపోయి, కోపాన్ని భరిస్తుంటే ఆ బలహీనతని తను లోకువగా తీసుకుని ఆయనముందు ఏ భార్యా ప్రవర్తించకూడని తీరులో ప్రవర్తిస్తోంది.

ఎంతకాలం ఇలా? ఆయనతో జీవితాంతం కలిసి జీవించాల్సిన తను ఎందుకిలా ప్రవర్తిస్తోంది? ఎందుకు తనలోని కోపాన్ని, ద్వేషాన్నీ అణచుకునే ప్రయత్నం పిసరంత కూడా చేయటంలేదు?

నీరజ తర్వాత క్లాస్‌కి హాజరవలేదు. వెంటనే లేచి యింటికి వచ్చేసింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in